సరి'హద్దులు' దాటిన జూదం

- రోజుకోచోట స్థావరాల మార్పు
- రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం
- జూదానికి బానిసవుతున్న సామాన్యులు



జూదం ఆడుతుండగా వైరల్‌గా మారిన వీడియో

రాయదుర్గం: రాష్ట్రంలో పేకాట, జూదానికి తావు లేదు..వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. పేకాట, జూద కేంద్రాలు కొందరికి కాసులు కురిపిస్తున్నాయి. ఖద్దరు నేతల సపోర్ట్‌తో కొందరు రెచ్చిపోతున్నారని విమర్శలు వస్తున్నాయి. కొందరైతే ప్రభుత్వం మా జోబులో ఉందన్నట్టు చెప్పుకు తిరుగుతున్నారు. అందరినీ మేనేజ్ చేశాం.. జూద స్థావరాల వద్దకు ఎవరూరారు.. ఇబ్బందేమీ లేదని ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, డీహీరేహాళ్, ఉరవకొండ ప్రాంతాల్లో జూదం జోరుగా సాగుతోంది.

- రాయదుర్గం శివారులోని శంభులింగకొండ ప్రాంతంలో గుట్టుగా నడుస్తున్న పేకాట క్లబ్‌పై ఆగస్టు 24న అనంతపురం ఎస్‌టీజీ పోలీసులు మెరుపు దాడిచేశారు. సుమారు 21 ద్విచక్ర వాహనాలు, రూ.43,210 నగదు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో బాధ్యులపై కేసులు నమోదు చేశారు.
- ఉడేగోళం వద్ద 8 మంది పేకాట రాయుళ్లు ఇటీవల పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.10,800 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 2న కొండపై ఏడుగురు పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.10,400 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- రాయదుర్గం మండలం టీ వీరాపురం పరిసరాల్లోని అటవీప్రాంతం పేకాట నిర్వహణకు అడ్డాగా మారింది. దీనిపై పోలీసులు నిఘా పెట్టలేదు.
- బొమ్మనహాళ్ మండలంలోని పలు గ్రామాల్లో పేకాట జోరందుకున్నట్టు ప్రచారం సాగుతోంది. కర్ణాటక ప్రాంతం నుంచి పేకాట ఆడేందుకు వస్తున్నట్టు తెలుస్తోంది.
- డి హీరేహాళ్ మండలంలోనూ ఈ ఆట జడలు విప్పుకుంది. జాతీయ రహదారి ఉండడంతో కొత్త వ్యక్తులు ఈ ఆటలో భాగస్వాములు అవుతున్నట్టు ప్రచారం. అరికట్టాల్సిన అధికారులు.. ఇక్కడ మీనమేషాలు లెక్కిస్తున్నట్టు తెలుస్తోంది.
- రాయదుర్గం పరిసరాల్లోని కొండగుట్టల్లో పేకాట స్థావరాలు ఉన్నట్టు స్థానికులు చెపుతున్నారు. గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి సమీపాన ఫారెస్ట్, అడిగుప్ప కొండల్లోనూ పేకాట సాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనూ ఇదే తరహా పేకాట జోరుగా సాగుతున్నట్టు సమాచారం. పోలీసులు నిఘా పెంచి కట్టడికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాయదుర్గం, బొమ్మనహాళ్, డి హీరేహాళ్, కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో కొందరు అడ్డాలు ఏర్పాటు చేసుకుని జోరుగా జూదం ఆడిస్తున్నారు. రాయదుర్గం మండలం టీ వీరాపురం చుట్టు పక్కల ఈ గ్యాంబ్లింగ్ ఎక్కువైనట్టు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో నిత్యం రూ.లక్షల్లోనే ఈ జూదానికి తగలేస్తున్నారు.

సినీ పక్కీలో ఆట నిర్వహణ?

పట్టణం, ఆయా మండలాల్లో పేకాట వ్యసనం కలిగిన వారి వివరాలు సేకరించి వారికి సెల్‌ఫోన్‌లో సమాచారం పంపి ఓ చోటకు రప్పిస్తారు. ఉదయం 11 గంటల తర్వాత నిర్వాహకుడు చెప్పిన ప్రదేశానికి (పికప్ పాయింట్) చేరుకోవాలి. అక్కడ ఒకరు ఆటకు వచ్చేవారి సెల్‌ఫోన్లను సేకరించి తనవద్ద ఉంచుకుంటారు. మరో వ్యక్తి ఆటలో పాల్గొనే వారందరినీ ముందస్తుగా స్థావరానికి (సుమారు 2 నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని ప్రదేశం) తీసుకెళ్తారు. ఈ అడ్డా ఏ రోజుకు ఆరోజే మార్చేస్తున్నట్టు సమాచారం. నిర్దీత అడ్డాకు నలువైపులా నిర్వాహకుడి మనుషులు గస్తీగా ఉంటారు. కార్లు, పోలీసు వాహనాలు, కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే నిర్వాహకుడికి సమాచారం ఇస్తారు. అప్పటికప్పుడు అడ్డాలో అంతా మార్చి వేస్తారు. నిర్వాహకుడికి రోజుకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు లేదా రూ.లక్ష వరకు ఆదాయం రావొచ్చని చర్చ సాగుతోంది. పేకాట వ్యసనంగా మార్చుకున్న కొందరు అక్కడే అధిక వడ్డీకి అప్పు తీసుకుని ద్విచక్ర వాహనాలు, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టు డబ్బంతా జూదానికే తగలేసి అప్పుల పాలవుతున్నారు. ఈ మహమ్మారిని శాశ్వతంగా తరిమికొట్టేలా పోలీసులు విస్తృత చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

పోలీస్ యంత్రాంగం పటిష్టంగా పనిచేస్తోంది

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాం. ఎక్కడికక్కడ పోలీస్ యంత్రాంగం దీనిపై పటిష్టంగా పనిచేస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే విస్తృతంగా దాడులు నిర్వహించాం. నగదు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశాం. ఎక్కడైనా గుట్టుగా సాగే కేంద్రాలపైనా నిఘా ఉంచాం. మట్కా, పేకాట, ఆన్‌లైన్ జూదం అరికట్టడమే లక్ష్యం. జూద కేంద్రాలు ఉన్నట్టు తెలిస్తే సత్వరం పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. యువతకు ఈ చెడు వ్యసనానికి వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రులు కూడా నిఘా వేసి ఉంచాలి.

– రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ శ్రీధర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని బీసీ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థులకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోఆర్డినేటర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాధర్, హాస్టల్ వార్డెన్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం ఎస్‌ఐగా నరేంద్ర కుమార్



బ్రహ్మసముద్రం: ఎస్‌ఐ జీ నరేంద్ర కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

27 నుంచి ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలు



రాష్ట్ర మహాసభ పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: విజయనగరంలో ఈ నెల 27,28,29,30 తేదీల్లో నాలుగు రోజుల పాటు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని నియోజకవర్గ అధ్యక్షుడు శశికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మహాసభ పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. మహాసభల్లో విద్యారంగ సమస్యల పరిష్కారం, ఉద్యమ కార్యచరణపై చర్చించనున్నట్లు తెలిపారు.

అక్కమాంబ ఆలయంలో నాగుపాము కలకలం



ఆలయ ప్రాంగణంలో నాగుపాము

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక అక్కమాంబ ఆలయంలో సోమవారం నాగుపాము కలకలం రేపింది. కార్తీక మొదటి సోమవారం సందర్భంగా పూజలు చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తల మధ్యకు నాగుపాము రావడంతో భయాందోళనకు గురయ్యారు. కార్తీక మాసంలో అక్కమాంబ తల్లే నాగుపాము రూపంలో వచ్చిదంటూ భక్తులు మొక్కు తీర్చుకున్నారు. మరికొందరు అక్కమాంబ ఆలయంలో పూజారుల మధ్య విబేధాలున్నాయని, అమ్మవారిని పట్టించుకోకపోవడం వల్లే హెచ్చరికగా నాగుపాము వచ్చినట్లు చర్చించుకున్నారు.

పొట్టేళ్ల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

- కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ ఇ.చంద్రాయుడు

కళ్యాణదుర్గం: పొట్టేళ్లు, గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు అవసరమని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఇ.చంద్రాయుడు అన్నారు. సోమవారం కేవీకే పశువిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.హరణితో కలిసి ఆయన సూచనలు, సలహాలు ఇచ్చారు. గొర్రెల మందలో అనారోగ్యంగా ఉన్న వాటిని గుర్తించడం వల్ల మరణాల సంఖ్యను తగ్గించొచ్చన్నారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ నెల వరకు వచ్చే వ్యాధుల్లో నీలినాలుక వ్యాధి ప్రధానమైందన్నారు. ఈ వ్యాధి సోకితే జీవాలకు తీవ్రమైన జ్వరం, చిగుళ్ల వాపు, నోటి లోపల నాలుక మీద కురుపులు, నాలుక చీలి నీలిరంగులోకి మారడం, నోటి దుర్వాసన రావడం గమనించవచ్చన్నారు. ముందుగా ఆక్సీటెట్రాసైక్లిన్ 5-10 మి.గ్రాములు ఇవ్వాలని తెలిపారు. రైతులకు ట్రైకోడెర్మా, సూడోమోనాస్, పౌడి, ద్రవ రూపాల్లో కేవీకేలో అందుబాటులో ఉందని సూచించారు.

ప్రకృతి సేద్యంతోనే దిగుబడి



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కుందుర్పి: ప్రకృతి సేద్యంతోనే రైతులు పంటల ద్వారా మేలైన దిగుబడి సాధించొచ్చని వ్యవసాయ అధికారి మహేష్ తెలిపారు. సోమవారం మండలంలోని అప్పిలేపల్లి గ్రామంలో ప్రకృతి సేద్యం ద్వారా పంటల సాగు, సేంద్రియ ఎరువుల వాడకం, కషాయాల తయారీ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

బొమ్మనహాళ్: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ తాలుకా కార్యదర్శి నాగార్జున, రైతు సంఘం అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ మునివేలుకు సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో అధికారులు పర్యటించి 90 హెక్టార్లలో మాత్రమే పంటలు దెబ్బతిన్నట్లు తప్పుడు నివేదిక ఇచ్చారన్నారు. సీపీఐ నాయకులు తిప్పేస్వామి, కృష్ణ, రామాంజనేయులు, మల్లప్ప, ప్రకాష్, వసిగిరప్ప తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి గౌస్‌పీర్ డిమాండ్ చేశారు. 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ముల్లా శర్మాస్‌వలి, మండల సహాయ కార్యదర్శి బషీర్, నాయకులు చంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

కూడేరును కరువు మండలంగా ప్రకటించాలి

కూడేరు: కూడేరును కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ తక్కువ వర్షం కరిసే మండలాన్ని కరువు జాబితాలో చేర్చకపోవడం చాలా దారుణమన్నారు. వినతి పత్రాన్ని డీటీ సూర్య ప్రతాప్‌కు అందజేశారు. పార్టీ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, తాలుకా వ్యకాసం అధ్యక్షుడు ప్రసాద్, మండల కార్యదర్శి నారాయణమ్మ, నేతలు శ్రీరాములు, మలరాయుడు, రమణప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గంలోని ఐదు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియజేశారు. అనంతరం ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం అందించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ మాట్లాడారు. కంబదూరు, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కంబదూరు, కళ్యాణదుర్గం ఐదు మండలాల్లో రైతులు తీవ్రంగా పంట నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు.

సామూహిక చర్యలతోనే మిడతల నివారణ



మిడతలతో దెబ్బతిన్న శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కణేకల్లు: పప్పుశనగ పంటను నాశనం చేస్తున్న మిడతలను నివారించేందుకు రైతులు సామూహిక చర్యలు చేపట్టాలని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రాయుడు, శిరీష, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం శాస్త్రవేత్తలు ఎన్.హనుమాపురం గ్రామంలో శనగ పంటను పరిశీలించారు. ప్రస్తుతం శనగ పంట 10 నుంచి 15వ రోజు దశలో ఉందని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. చిన్న,చిన్న మొక్కలను మిడతలు తింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మిడతల బెడద ప్రారంభ దశలో ఉందని రైతులు నిర్లక్ష్యం చేస్తే వీటి సంఖ్య గణనీయంగా పెరిగి శనగ పంటను పూర్తిగా నాశనం చేస్తోందని శాస్త్రవేత్తలు చెప్పారు. రాత్రి వేళల్లో టైర్లు కాల్చి మంటలు వేయడం లేదా ఎండుగడ్డి, కట్టెలతో మంటలు వేయడం చేస్తే మంటల వెలుతురుకు మిడతలు అక్కడికొచ్చి వాలి కాలిపోతాయన్నారు. పొలాల గట్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ నివారణ చర్యల తర్వాత మలాథియాన్ లేదా డెల్టామిథ్రిన్ పౌడి మందు 5 గ్రాములు కేజీ వరిపొట్టులో కలిపి పొలంలో చల్లాలన్నారు. ఎకరాకు 40 కేజీల మందును చల్లితే భూమిలో ఇంకా ఏవైనా మిడతలు మిగిలి ఉన్నా వాటి గ్రుడ్లు నాశనమవుతాయన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు



బెళుగుప్పలో అలంకరణలో రామేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వర స్వామి



పూజలు చేస్తున్న భక్తులు



కళ్యాణదుర్గం కోటవీధిలో అలంకరణలో స్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శివాలయాలతోపాటు ప్రముఖ ఆలయాల్లో కార్తీక మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కార్తీకమాసం తొలి సోమవారం పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో అరవ, ఏరే, అవ్వారి వంశీయుల ఆధ్వర్యంలో స్వామివారికి కార్తీక పూజలు జరిగాయి. పట్టణంలోని చన్నవీరస్వామి, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, బసవేశ్వరస్వామి, వీరభద్రస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి, రేవణసిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక దీపారాధణ, పూజలు జరిగాయి.

కణేకల్లు: కార్తీక మాసంలో భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించి శివుడి అనుగ్రహం పొందాలని పాల్తూరు మఠం పీఠాధిపతి చెన్నవీర శివాచార్యస్వామి పేర్కొన్నారు. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయంలో తొలి కార్తీక సోమవారం సందర్భంగా స్వామిజీ కార్తీకదీపోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు.

గవిసిద్ధేశ్వరుడికి విశేష పూజలు

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళేశ్వరస్వామి క్షేత్రం భక్తులతో సోమవారం కిటకిటలాడింది. కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి గుహలో వెలసిన గవిసిద్ధేశ్వరుడికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆలయం బయట ఉన్న శివుడి త్రిశూలం వద్ద మహిళలు కార్తీక దీపారాధన చేశారు.

బసవేశ్వరుడికి కార్తీక పూజలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని పలు శైవ క్షేత్రాలు, అక్కమాంబ ఆలయం, నృసింహాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కోటవీధిలోని పేట బసవేశ్వర ఆలయంలో శివలింగానికి పూజలు చేశారు.

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన ఆలయం కమల మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

బెళుగుప్ప: రామేశ్వరస్వామి ఆలయం, నగరేశ్వరాలయం, కన్యకాపరమేశ్వరి, బూదిగుమ్మ పద్మావతి వెంకటమణస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, నక్కలపల్లి శివాలయం, శ్రీరామాలయం, రమనేపల్లి ఆంజనేయస్వామి ఆలయం, శీర్పి శివాలయం ఆలయాల్లో సోమవారం కార్తీక పూజలు నిర్వహించారు.

జోడు లింగాల ఆలయానికి పోటెత్తిన భక్తులు

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి కార్తీక శోభ సంతరించుకుంది. సోమవారం పుట్టశిలయైన శివలింగాన్ని దర్శించుకునేందుకు జిల్లా నలమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.





గవిసిద్ధేశ్వరుడికి పూజలు, అలంకరణలో బసవేశ్వరుడు



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న శివాచార్యస్వామి

ఉచిత సిలిండర్ కోసం అవస్థలు



ఉరవకొండ సత్యసాయి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈకేవైసీ చేయించుకోవడానికి బారులుదీరిన జనం

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం వినియోగదారులకు తీవ్ర అవస్థలు తెచ్చిపెడుతోంది. గ్యాస్ సబ్సిడీ నగదు జమ కావాలంటే కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని నిబంధన పెట్టడంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద గంటల తరబడి వినియోగదారులు క్యూలో అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి ఉరవకొండకు ఈకేవైసీ కోసం వస్తున్న మహిళలు చంటి బిడ్డలతో ఎండలో గంటల తరబడి నిలబడలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉరవకొండలోని సత్యసాయి గ్యాస్ ఏజెన్సీ పరిధిలో 14,780 కనెక్షన్లు ఉండటంతో ఇందులో 50 శాతం మంది ఈకేవైసీ చేయించుకోలేదు. ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ప్రక్రియ నెమ్మదిగా జరుగుతోంది.

ఉచిత గ్యాస్‌కు దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: మండలంలోని అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన కుందుర్పిలో భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. మండలంలో 8,315 మంది బీసీఎల్ రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. డీటీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

దారికి అడ్డంగా నిర్మాణాలు

- పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ అధికారులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు



జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బంకు



మేడా వీధిలో రోడ్డును ఆక్రమించి మెట్లను ఏర్పాటు చేసుకున్న ఓ వ్యాపారి

కళ్యాణదుర్గం: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పట్టణంలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డు ఆక్రమించి దుకాణాలు, నిర్మాణాలు చేపట్టారు. ఇవన్నీ మున్సిపల్, రెవెన్యూ అధికారులకు కళ్లకు కట్టినట్లు కనబడుతున్నా తమకేమీ పట్టన్నట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ఓ భవనం వద్ద ఖాళీగా ఉన్న రహదారి స్థలంలో ఓ వ్యక్తి రాత్రికి రాత్రే బంకు ఏర్పాటు చేసుకున్నారు. గతంలో రోడ్డును ఆక్రమించి భవంతిని నిర్మించారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా రోడ్డు స్థలంలో బంకు ఏర్పాటు చేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పాటి దారిలో కార్లు, జీపులు, ఇతర వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోంది. ఎదురుగా వచ్చే వాహనాలొస్తే దారి లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గాంధీ చౌక్ నుంచి మేడావీధిలోని శాఖా గ్రంథాలయం వరకు ఒకే విధంగా ట్రాఫిక్ అంతరాయం ఉంటుంది. ఇదే దారి గుండా బ్రహ్మసముద్రానికి ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అయితే మేడా వీధిలో బంగారు దుకాణాల యజమానులు, కిరాణా, ఇతర వ్యాపారులు రోడ్డుపైనే నిర్మాణాలను నిర్మించారు. ఏకంగా సుమారు మూడు, నాలుగు అడుగుల మేర ఆక్రమించి మెట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇదంతా అధికారులకు కనిపిస్తున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

రోడ్డును ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదు. ఆక్రమణదారులు ఎవరైనా సరే చర్యలు తీసుకుంటాం. టౌన్ ప్లానింగ్ అధికారులను, సిబ్బందిని పంపి పరిశీలిస్తాం. తప్పకుండా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అక్రమ కట్టడాల యజమానులకు నోటీసులిచ్చి తొలగిస్తాం. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలి.

– వంశీకృష్ణ భార్గవ్, మున్సిపల్ కమిషనర్, కళ్యాణదుర్గం

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు



ఎన్నికలపై మాట్లాడుతున్న అధికారులు

బెళుగుప్ప: మండలంలోని మూడు గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇరిగేషన్‌శాఖ ఎన్నికల ప్రత్యేక అధికారి సుధాకర్, తహసీల్దార్ షర్మిల తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గంగవరం, శ్రీరంగాపురం, శీర్పి గ్రామాల చెరువుల కింద ఆయకట్టుదారుల సంఘాల్లో రైతుల జాబితాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఈనెల 10న ఆయకట్టుదారుల ఓటర్ల జాబితాను సచివాలయాల వద్ద ప్రదర్శిస్తామన్నారు. 12 లోపు అభ్యంతరాలు తెలిపాలని, 13న తుది జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి ఆయకట్టుదారుల సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: ముప్పలకుంటలో వాల్మీకి జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఉదయం మహిళలు జ్యోతులు, కలశాలను మోసుకుంటూ ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి చిత్రపటం వద్ద సమర్పించారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం వాల్మీకి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

జగన్ నాయకత్వాన్ని బలపరచాలి



టీజీఆర్ సుధాకర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గోవిందు

గుమ్మఘట్ట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు తెలిపారు. జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు టీజీఆర్ సుధాకర్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గోవిందు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు.

సంక్షిప్త సమాచారం

దళితులపై వివక్ష తగదు

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దళితులపై వివక్ష చూపుతున్నారని ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ వసంత్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఇప్పటికీ గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, హోటళ్లలో వివక్ష చూపుతున్నారన్నారు. సమాజంలో మార్పుకోసం ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు డుమ్మా

కూడేరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మాకొట్టారు. డీటీ సూర్య ప్రతాప్, పశు వైద్యాధికారిణి శ్వేత, ఐకేపీ సిబ్బంది రమణ హాజరయ్యారు. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. పది వినతులు వచ్చినట్లు డీటీ తెలిపారు.

రెండు వినతులు

గుమ్మఘట్ట: రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రెండు వినతులు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

6న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట

కూడేరు: మండలంలోని ముద్దలాపురంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 6న విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి మల్లేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని దేవగిరి గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రుక్మిణి, ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, నాగేంద్ర, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కుందుర్పి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు అనూషా, చాంద్‌బేగం సూచించారు. సోమవారం మండలంలోని బసాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్‌లో అసోసియేట్ కస్టమర్ కేర్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఎంబీఏ, ఎంకాం విద్యార్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9182920381లో సంప్రదించాలన్నారు.

వాలీబాల్ పోటీల్లో యాటకల్లు విద్యార్థుల ప్రతిభ

శెట్టూరు: అండర్-14 వాలీబాల్ పోటీల్లో యాటకల్లు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. శనివారం అనంతపురంలో జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీలో విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి తెలిపారు. సోమవారం యాటకల్లు పాఠశాలలో విద్యార్థులకు అభినందించారు. అండర్-14 బాలుర జట్టు నుంచి బోయ ఈశ్వర్, అండర్ -14 బాలికల జట్టు విభాగంలో గొల్ల ఇందు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఫణిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ర్యాలీ

ఉరవకొండ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ (రూరల్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ - రిడ్స్) ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఉరవకొండలోని ఎస్కే ఉన్నత పాఠశాల నుంచి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేశారు. కళ్యాణదుర్గం రిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్ మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారిని చిన్నచూపు చూడకుండా వారిలో మనోధైర్యం నింపాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం వీరన్న, రిడ్స్ సభ్యులు షకీలా, మౌనిక, ఏఎన్‌ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. సోమవారం స్థానిక సీఐటీయూ, మున్సిపల్ కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శనతోపాటు భిక్షాటన చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు వచ్చారు. అక్కడ బైఠాయించి నిరసనతోపాటు భిక్షాటన చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమబాట చేపడుతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్ రెడ్డికి వినతిపత్రం అందించారు.